నే భయ భ్రాంతు లవుతున్నారు. జనం.

కానీ—

కష్టాలతో, కన్నీళ్ళతో, మొండిదేరి బండబారిపోయిన మాధవరావుగారు మాత్రం-

అప్పటివరకూ అస్పష్టంగా అగుపించే ఆఖరి ఆశా రేఖ కూడా ఆరిపోగానే, కంటిముందు కారు చీకటి కమ్ముకుపోయి నిస్సత్తువతో నీరుకారి పోగా, ఆయింటిగడప దాటి రోడ్డెక్కారు.

మనసులో ముసురు కున్న దిగులుతో... శరీరానికి ప్రకృతి కలిగించే బాధలను గ్రహించే పరిస్థితిలో లేరు మాధవరావుగారు

కొండలు బండలయ్యే ఎండలో

సందు మలుపు దాకా సాగిపోయి బస్టాండ్ వైపుకి దారి తీసారు.

దారిలో- దాహంతో పిడచ కట్టుకుపోయిన పెదాలను తడారిన నాలుకతో తడుపుకున్నారు.

మొహాన ధారలుగా కారే చెమటలను భుజం మీద తువ్వాలుతో తుడుచుకున్నారు.

సూటిగా చూస్తున్న సూరీడి సూపుకి వెంట్రుకలు రాలినబోడి బుర్ర చుర్రుమంటుంటే...ఆ తువ్వాలునే తలపాగాగా చుట్టుకున్నారు.

నీరసంతో తిరగాడే కళ్ళను అతి ప్రయత్నాన తమాయించుకుంటూ --

సత్తువ చచ్చిన కాళ్ళతో సాగిపోతున్నారు. భారంగా--

ఓపిక లేని వంటిని మోస్తూ కదిలిపోతున్నారు బరువుగా--

ఆయన అంతరంగంలో మాత్రం అలుపూ సొలుపూ లేని ఆలోచనలు చోటు చేసుకొని....

కడలి తల్లి గర్భంలో చెలరేగుతున్న సుడి గుండాలలా విరుచుకు పడుతున్నాయి.

కందిరీగల తుట్టలా కదలాడుతున్నాయి

ఆ ఆలోచనల ధాటికి తట్టుకోలేని ఆయన తలనరాలు చిట్లిపోతున్నా-

తాను నమ్ముకున్న నేలే తనను దగా చేస్తున్నట్లు

తనకన్నే తనను మోసగించినట్లు

తన కాళ్ళకింద భూమి బ్రద్దలై తానందులో కూరుకుపోతున్నట్లు

భూమీ- ఆకాశం హత్తుకుపోయినట్లు
వాటి రెండింటి నడుమా పడి నిర్దాక్షిణ్యంగా తానునలిగిపోతున్నట్లు—
భయంకరమయిన ఆలోచనల పాల్పడి.
ఓపిక లేకపోయినా
సత్తువ రాకపోయినా
ముందుకు — మున్ముందుకు సాగిపోతున్నారు.
చుట్టుపక్కల తనకేమీ సంబంధం లేనట్లు -
తనచుట్టూ లోకమనేదొకటి లేనట్లే—
బిగించుకుని, కాళ్ళీడ్చుకుంటూ—
నిస్తేజంగా, నిర్వికారంగా, నిస్సత్తువుగా సాగిపోతున్నారు.
చాలా కాలంగా మంచాన్నెక్కి, మందులనే ఆహారంగా మింగుతూ, మూల్గులతో మూలపడున్న భార్య పార్వతమ్మ.
కట్నం డబ్బు పూర్తిగా చెల్లుబాటు చేయలేదని, ఆ డబ్బు తెస్తేనేగాని కాపురానికి రానక్కర లేదంటూ అల్లుడు పంపివేయగా— కన్నబిడ్డలిద్దరితోనూ పుట్టింట్లో చేరుకున్న కన్నకూతురు కామాక్షి.
కుటుంబం గడవని పరిస్థితులలో పదో తరగతి పరీక్షలయినా రాయకుండానే పెద్దరికం పుచ్చుకుని పనిలో (క్లాత్ షాపులో సేల్స్‌బాయ్‌గా) చేరిన చిన్న కొడుకు పరమేశ్.
గుండెలమీద కుంపటిలా... ఈమధ్యనే "రజస్వలయి"న పెళ్ళికాని మూగకూతురు మీనాక్షి.
ఆరో తరగతిలో కడుగట్టిన ఆఖరోడు—
గతించిన మూడురోజులుగా పొయ్యిలో పిల్లుల్ని లేపాల్సిన అవసరం రానియ్యని ఇంట్లో పరిస్థితులు—
అన్నీ—
కళ్ళముందు కదలి
మాధవరావుగారి మనసు—
కదిపిన తేనెపట్టు మాదిరి కల్లోలమైపోయింది.
మిగతా అన్నింటి విషయమెలా ఉన్నా—
ప్రస్తుతం—
పొయ్యిలో పిల్లులు స్థిరనివాసం ఏర్పరచుకోకుండా చూడాలంటే—
ప్రతిరోజూ తామందరం కడుపు

కింత కలో గంజో (తాగాలంటే
టైఫాయిడ్ బారినుంచితప్పించుకోలేక తంటాలు పడుతున్న చిన్నకొడుకు-

జీనకొచ్చే పెన్షన్ డబ్బులు నూటపాతికకీ, ప్రతినెలా మరో రెండొందలు జతచేస్తూ చిల్లులు పడ్డ తనజీవిత నౌకకి ఆధారమయిన చుక్కాని-

కామేశ్ త్వరగా కోలుకోవాలి.

అందు కవసరమయిన మంచి మందులు, బలమయిన ఆహారం యివ్వటానికి కావలసిన డబ్బు సంపాదించటానికి మాధవరావుగారెన్ని విధాలా ప్రయత్నించినా, అన్నింటా తన దురదృష్టం వెక్కిరిస్తూ ఎదురొచ్చింది.

నిరాశ నిట్టూరుస్తూ నిలిచింది.

చివరికి- చీదరించుకుంటూ నయినా, అప్పుడప్పుడూ చిన్న చిన్న అవసరాలకి చేదోడు వాదోడుగా ఉంటున్న పెద్ద కొడుకు రమేశ్ మీదే ఈసారికూడా తన ఆఖరి ఆశను పెట్టుకుని

రేషన్ కార్డుని కిరాణా షాపులో తాకట్టుపెట్టి, ఆ డబ్బుతో రాజమండ్రి ప్రయాణంకడితే--

"యివ్వను" అని ఖచ్చితంగా చెప్పలేని యిబ్బందుల నెన్నింటినో వెదుక్కుని, అన్నీ వరుసగా ఏకరువు పెట్టి, తన నిస్సహాయ స్థితి నిజం సుమా!" అన్నట్లు నమ్మలా నటించి, కృతకృత్యుడయ్యాడు రమేశ్.

ఆ విధంగా తన ఆఖరి ఆశ కూడా అంతరించి పోయేసరికి—

మరో పదేళ్ళు వయసుపైబడిన నీరసం ఆవహించి.

మూల్గినక్కమీదతాటిపండు పడ్డట్లయి తల్లడిలి పోయారు.

ం ం

రమేష్ మాధవరావుగారి మొదటి సంతానం

అందుచేత అతని మీదఎన్నో ఆశలు పెంచుకుని, తనశక్తికిమించిన పని అని తెలిసినా కొడుకుని యింజనీర్ చదివించా లనుకున్నారు.

అందుకోసం--

పార్వతమ్మగారు కాపురానికి వస్తూ పసుపు కుంకుమలక్రిందతన తో పాటూ తెచ్చుకున్న బంగారంలాంటి రెండెకరాల భూమి బయటివారి సొత్తయి పోవటమే కాకుండా-

పిత్రార్జితంగా సంక్రమించిన మాధవరావుగారి పాత డాబా కొంప కూడా పరుల పాలయింది.

అయినా సరే—

ఇందుకు మాధవరావుగారు కానీ, పార్వతమ్మగారుకానీ పీస మెత్తుకూడా విచారపడలేదు

తాముకన్న కొడుకు గొప్ప చదువులు చదివి ప్రయోజకుడ యితే—

ఆగొప్ప! గౌరవం! తమవే అన్నట్లుగా తెగ సంబరపడిపోయూరు.

తమకొడుకుయింజనీర్ కాగానే తమ కష్టాలన్నీ తీరిపోయి నట్లేనని తమకుటుంబ బరువు బాధ్యతల్ని వాడే మోస్తాడని,

ఎన్నెన్నో బంగారు కలలు కన్నారు.

ఆ కలలు పంట పండేందుకు ఎన్నో అష్టకష్టాలను భరించి చివరికెలాగయితేనేం కొడుకునియింజనీర్ చేయగలిగారు.

కానీ—

తమ కలలు కన్నంత సేపు కూడపట్టలేదా భార్యాభర్తలకు

తమకలలు కల్లలై కంటిముందునిలిచేందుకు— కన్నీళ్ళు నిలిచేందుకు

రమేష్ యింజనీర్ చదువు అయిపోవటం— రాజమండ్రి "ఆర్ అండ్ బి" లో జూనియర్ ఇంజనీర్ ఉద్యోగం రావటమూ ఆతరువాత అర్ధ సంవత్సరానికే "అనిత" నే అందాల బొమ్మను వరించి మనువాడటమూ— ఆపై ముచ్చటగా మూడు నెలలయినా కాకుండానే తల్లి తండ్రులనుంచి వేరుకావటమూ—తరువాత మెల్లగా వాళ్ళ ఎడ్రసునే మరచిపోవటమూ —అన్నీ— వరుసగా—

ఏమాత్రం అడ్డంకులు లేకుండా అర్జంటుగా జరిగిపోయాయి.

కొడుకేదో తమను ధరిస్తాడని.... వాడికొచ్చిన కట్నం డబ్బుతో కన్నకూతుర్ల కన్నె చెర విడిపించాలని, ఏవేవో ఊహలతో.... ఎన్నెన్నో ఆశలతో ఉన్నవంతా ఊడ్చిపెడితే—

చివరికిలా జరిగేసరికి—

తాముకట్టుకొన్న ఆశాసౌధాలన్నీ గాలివాలుకి కూలిపోయే పేకమేడల్లా చెల్లాచెదరై పోగా—

అప్పటినుంచీ యింట్లో ప్రతి సామానూ స్థానభ్రంశం చెందటం గావించి.

చివరకీనాడు-

వ్యాన్లో ఒక్కపైసా కూడా అప్పుపుట్టని పరిస్థితుల్లో.. అర్థాకళ్ళతో...అద్దె కొంపల పాలై అష్టకష్టాలతో అవస్థలు పడుతున్నారు.

o o o

అలంకరణ పూర్తిచేసుకున్న అనిత మరోమారు తుదిమెరుగులు దిద్దుకుని డ్రెస్సింగ్ టేబుల్ ముందునుంచి పైకిలేచింది.

చివరిసారిగా చీరంచులు సరిచేసుకొనితనివితీరా వివిధభంగిమలలో తనరూపాన్ని తానే తన్మయత్వంగా చూసుకుని సంతృప్తిగా ఊపిరిపీల్చుకుంది.

అందమయిన తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకొని మురిసిపోతూ అప్రయత్నంగా వాల్ క్లాక్ వైపు మరలి ఉలిక్కిపడింది.

ఐదు గంటలయ్యే సరికల్లా "హీరో" టిక్కెట్లతో సహా నీ ముందుంటానంటూ వెళ్ళిన పెద్దమనిషి అయిదుయిరవై అయినా, అబ్బాయి గారి దర్శనం యింకా కాలేదేమా! అనివిసుక్కుంటూ-

మరోసారి అద్దంలో-ముద్దొచ్చే తనప్రతిబింబాన్ని ముచ్చటగా తిలకించి - బయటనున్న హాల్లోకొచ్చి కూర్చుంది.

కాలం మరికొంత ముందుకు కదిలింది.

గడియారంలోని ముళ్ళు గతి తప్పకుండా సక్రమంగా కదులుతూనేయున్నా-

అనితకు మాత్రం క్షణమొక యుగంలా బరువుగాతోచి అసహనంగా కుర్చీలో అటూయిటూ తెగకదులుతుంది.

అదేసమయంలో...

వచ్చివారం రోజులయినా బ్లాక్ లో కూడా టిక్కెట్స్ దొరక్క జనం కొట్టుకు చస్తున్న "హీరో" సినిమా టిక్కెట్స్ రెండు అతి ప్రియమైన ఒక మిత్రుని ద్వారా సంపాదించి వేగంగా స్కూటర్ మీదొస్తున్నాడు రమేష్.

ఒకసారి వాచీ చూసుకున్నాడు. చేతికున్న యింపోర్టెడ్ అయిదూనలభై చూపెట్టింది.

ఆలస్యంగా వచ్చినందుకు అప్రసన్నంగా ఉన్న అనితముఖంలోకి చూస్తూ తను తెచ్చిన టికె

ట్స్ రెండింటినీ ఆమె ముఖం ముందుంచాడు.

అవి చూడగానే అద్దంలా తళుక్కున మెరిసిన అనిత ముఖం చూసి సిగ్గుపడేలా చిన్నగా బుగ్గపై చిటికేసి లోపల కెళ్ళాడు.

అయిదు నిమిషాల్లోనే అందంగా తయారయి వచ్చిన రమేశ్ స్కూటర్ స్టార్టు చేయబోయేంతలో–

బయట గేటు దగ్గర ఆగిన ఆటోలోంచి దిగిన ఆనందరావూ ఆదినారాయణను చూడగానే

అనితా, రమేశ్ లు అవాక్కయిపోయి, అంతలోనే తేరుకొని ఆదరంగా లోపల కాహ్వానించారు.

అనవసరంగా సినిమా చాన్సు కాస్త మిస్సయి పోయినందుకు కాస్తంత డిసప్పాయింట్ అయినా ఆవచ్చినది తనసొంత మేనమామ మేనల్లుడూ కావటంతో పెద్ద బాధనిపించలేదు అనితకు.

ఆనందరావు మంచి లౌక్యుడు. లోకజ్ఞానం కలవాడూ కావటమే కాకుండా, తనకు కావలసిన పను లేవిధాన చేయించుకోవాలో కూడా బాగా తెలిసిన వ్యవహార్త!

రాత్రి అందరూ భోజనాల కూర్చున్నపుడు డైనింగ్ టేబుల్ దగ్గర ఆదినారాయణకు ఏదయినా చిన్న ఉద్యోగం "ఏఎన్నై మ్యాత్రర్ పోస్టు, వర్క్ ఇన్స్పెక్టర్ పోస్టు" చూడమని రమేష్ తో అసలు విషయాన్ని మెల్లగా కదిపాడు.

ఆమాటలు విన్న అనిత "అదేమిటి మామయ్యా! ఇపుడు ఆదగాడ్ని చదువు మానిపించెయ్యట మెందుకు? అందులోనూ వాడు పదిమార్కులు తక్కువయినా పదోతరగతి ఫస్టుక్లాసులో పాసయ్యాడు కదా! యిపుడిలా అర్ధంతరంగా చదువు మానిపించేస్తే రేపొద్దుట వాడి భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించావా!" అంది.

అనిత మాటలకు ఆనందరావు చిన్నగా నవ్వుతూ–

"చూడు అన్నీ!.... కడుపున పుట్టిన ప్రతివాళ్ళనీ గొప్పవాళ్ళని చెయ్యాలనీ, వాళ్ళకు మంచి భవిష్యత్తు ఏర్పరచాలనీ, ప్రతి తల్లిదండ్రులూ కోరుకుంటారు.

అందుకోసం తమ సర్వస్వం అర్పించుకుంటారు. అదిబాధ్యతే కాదు కన్నవాళ్ళ కనీసధర్మం కూడాను. అయితే—

అలాగే—పిల్లలు కూడా తమ భవిష్యత్తు తీర్చి దిద్దటం కోసం! తమతల్లిదండ్రులెంత కష్టపడ్డారో. అనే ఆలోచనతో వీళ్ళధర్మం ళ్ళుకూడా పాటించాలి కదా! కనీసం కన్నవాళ్ళనే కనీస కృతజ్ఞతతోనయినా తమ కర్తవ్యం నెరవేర్చాలికదా!

కానీ— మారుతున్న ఈలోకం ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుంటున్నారేగానీ. మరొకటి ఆలోచించటంలేదు,

తను బాగుంటే చాలు! తన వాళ్ళేమయిపోయి నాతనకు అనవసరం అనే మనస్తత్వాన్ని అలవరచుకున్న ఈలోకాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్నాను కనుకే-

నా స్వార్థం నేను చూసుకుంటున్నాను.

అందుకే—

ఆ ఉన్నదేదో ఒక్కడికే ఖర్చుపెట్టి అందలమెక్కించి వాడిపై అర్థంలేని ఆశలెన్నింటినో పెంచుకుని అవన్నీ — ఎండమావులలోని మంచినీటి చుక్కల్లా యింకిపోతుంటే, చూస్తూ—

వేరు దారిలేక, వాడిఛీదరింపులను. చీత్కారాలను సహిస్తూ, వాడికటాక్ష వీక్షణాలకోసం కాచుకూర్చునే ఓపికానాకు లేదు.

అలా— నాకుటుంబం కూడా అందరిలాగే అప్పుల పాలై — ఆకలిచావులతో — ఆత్మహత్యలతో -ఒక్కొక్కరే యమసదనానికి చేరుకుంటుంటేచూడాలనే అభిలాష, తలంపూ నాకులేదు,

ఈ లోకంలో బ్రతకటానికి ఎంతో కొంత చదువు అవసరం కనుక ఏడోతరగతి వరకూ చదివించి, ఆపైన ఏదో ఒక పనిలో పెడితే వాళ్ళుబ్రతకటమే కాకుండా, మనకూ కూడా కాస్త ఆసరాగానూ ఉంటారు. అందరి పిల్లలకు తలో దారీ చూపించామనే...

ఆమాటలువింటున్న రమేశ్‌కు మెదడంతా మొద్దుబారి పోయినట్లయ్యింది.

పదునయిన బాకేదో గుండెల్లోగుచ్చుకున్నట్లనిపించి గిలగిల్లాడిపోయాడు.

తనతండ్రికూడా యిదే ఆలోచనలో తనను చిన్నప్పుడే చదువు మానిపించివుంటే... ఈవేళ తన బ్రతుకెలా ఉండేది...?

భయంకరమయిన ఆలోచనల మాలలు అతని మనసుని అలకరించుకుంటుంటే—

ఆపైన యిక ఆలోచించ లేక పోయాడు.

అనితతో ఆనందరావు గారి గీతోపన్యాసం యింకా కొనసాగుతూనేవుంది.

అవేవీ పట్టించుకునే పరిస్థితిలో లేని రమేశ్

తలపోటుతో భోజనం సహించటంలేదంటూ సగంలోనే చేతులు కడిగేసుకుని పైకిలేచి పడక గదిలో కెళ్ళిపోయాడు.

అప్పటివరకూ—

మనసులో ఏ మూలమూలో మినుకుమినుకు మంటూ కునుకుతున్న మానవత్వం మేల్కొని

కర్తవ్యం కళ్ళు తెరవగానే—

కన్నవాళ్ళు కళ్ళ ముందు మెదిలి కదిలిపోయిన రమేశ్.

పనులన్నీ చక్కబెట్టుకొని పక్కచేరిన అనితను ప్రతిరోజులా దగ్గరకు తీసుకొని బిగికౌగిలిలో బంధించలేకపోయాడు.

సరికదా—

పాముపక్కలో పడుకున్నట్టు కంటిమీద కునుకురాక తెల్లవార్లూ పక్కమీద పొర్లుతూనే గడిపాడు.

మరునాడు— రోజూ కంటే ముందుగా ఆఫీసుకు చేరుకున్న రమేశ్ తండ్రిపేర ఎం.ఒ. ఫారమ్ పూర్తి చేసి, ఆఫీసుప్యూనును అప్పలకొండనుపిలిచి ఆ ఎం.ఒ. ఫారమ్, ఆరువంద రూపాయల కాగితాలు యిచ్చి, పోస్టాఫీసుకు పంపించి కానీ— తృప్తిగా ఊపిరి పీల్చుకోలేకపోయాడు. ★

## 87లో సినీపరిశ్రమ

1987వ సంవత్సరం భారతదేశ ఫిలిం పరిశ్రమ 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. తెలుగు ఫిలిం పరిశ్రమకు 55వ సంవత్సరం నిండబోతుంది. 1987లో 153 చిత్రాలు విడుదల అయ్యాయి 86లో కంటె సంఖ్యలో 13 వరకు తగ్గినా ఖర్చులో 86 కంటేఎక్కువ ఖర్చుతో నిర్మించారు. ఈ సంవత్సరం కల్లోలాల కారణంగా కలవరపడిన పరిశ్రమగా సినిమా రంగాన్ని భావించవచ్చు.

-కె. నరసయ్య